సానుకూల దృక్పథంతో వ్యవహరించాలి



నిరుద్యోగులకు ఎన్నికల్లో హామీ ఇచ్చిన విధంగా నిరుద్యోగ భృతిని అందించడంతో పాటు జాబ్ క్యాలెండర్‌ను ప్రకటించి ఉద్యోగాల కల్పనకు రాష్ట్ర ప్రభుత్వం కృషి చేయాలి. పోటీ పరీక్షలకు వయో పరిమితిని సడలించి నిరుద్యోగ యువతకు ఉద్యోగాల పొందేందుకు అవకాశం కల్పించాలి.

– వి.లక్ష్మీశిరీష, సంధిపూడి, అలమూరు మండలం

త్వరగా నిర్ణయం తీసుకోవాలి



రాష్ట్రంలో నూతనంగా ఏర్పడిన కూటమి ప్రభుత్వంలో నిరుద్యోగులకు భృతి ఇస్తామని ప్రకటించారు అయితే నేటికీ దీనిపై ఎటువంటి విధి విధానాలు ప్రభుత్వం ఇంకా ప్రకటించలేదు. నాలాంటి బీకాం చదివిన నిరుద్యోగికి భృతి అందుతుందని ఆశిస్తున్నా.

– గొలుగూరి కృష్ణారెడ్డి, ఊబలంక, రావులపాలెం మండలం

నిరుద్యోగ భృతి ఎక్కడ?



ఎన్నికల సమయంలో కూటమి నాయకులు అధికారంలోకి వచ్చిన వెంటనే యువతకు నిరుద్యోగ భృతి ఇస్తామని ప్రకటించారు. అధికారంలోకి వచ్చాక నిరుద్యోగ భృతి, యువతకు ఉద్యోగ అవకాశాలు కల్పిస్తామని నమ్మబలికి ఇప్పుడు ఆంక్షలు పెట్టి యువతను మోసం చేయడం దారుణం.

– గోసంగి కుమారస్వామి, తొండవరం, అంబాజీపేట మండలం

మా మాట మరిచారా



బాబు వస్తే ప్రతి ఇంటికి జాబ్ ఇస్తామన్నారు. ఉద్యోగం ఇవ్వని పక్షంలో నిరుద్యోగ భృతి అయినా ఇస్తామని చెప్పారు. కానీ అధికారంలోకి వచ్చిన తరువాత మా మాట మరిచిపోయారనుకుంటా. ఇంత వరకు దీనిపై ఏవిధమైన ప్రకటన లేదు. నేను డిగ్రీ పూర్తి చేశాను. ఎన్నికల్లో ఇచ్చిన హామీని తక్షణం అమలు చేయండి.

– తాటిపాక హవీల, మాగం, అయినవిల్లి మండలం

ప్రచార ఆర్భాటమేనా



సూపర్ సిక్స్ అన్నారు. నిరుద్యోగ భృతి ఇస్తామని ప్రకటించారు. ఎక్కడ చూసినా ఈ పథకాలనే ప్రచారం చేశారు. ఇవి కేవలం ప్రచారానికే పరిమితమా. లేక అమలు చేసేది ఉందా. నిరుద్యోగులకు ఉద్యోగాలు అయినా ఇవ్వాలి లేదా నిరుద్యోగ భృతి అయినా ఇవ్వాలి.

– ఆకుమర్తి సంపత్‌కుమార్, పెదపట్నంలంక, మామిడికుదురు మండలం

కలలు కల్లలేనా?



బాగా చదువుకుని ప్రయోజకులవ్వాలని విద్యార్థులు, వారి తల్లిదండ్రులు ఎంతో ఆశగా ఎదురుచూస్తుంటారు. ఆర్థిక సమస్యలతోనూ.. ఏదోలా చదువుకుని మంచి ఉద్యోగం సంపాదించి కుటుంబానికి ఆసరాగా ఉండాలని ఉబలాటపడుతుంటారు. కానీ ప్రభుత్వం ఉద్యోగాలు కల్పించదు, అలాగని ఎన్నికల మేనిఫెస్టోలో ఇచ్చిన హామీ మేరకు నిరుద్యోగ భృతిని ఇవ్వరు. ఈ నేపథ్యంలో నిరుద్యోగులు కన్న కలలు కల్లలుగా మిగిలిపోవాల్సిందేనా అని మదనపడుతున్నారు.

- జాబ్ క్యాలెండర్ ప్రకటించకపోవడంపై అడియాశలు
- నిరుద్యోగ భృతిపై ఖరారు కాని విధి విధానాలు
- గతంలోనూ మాట తప్పిన చంద్రబాబు
- ప్రకటన చేయాలని నిరుద్యోగుల డిమాండ్

అలమూరు/మామిడికుదురు/మలికిపురం: రాష్ట్రంలోని టీడీపీ ప్రభుత్వం ఇటీవల జరిగిన సార్వత్రిక ఎన్నికల్లో అనేక హామీలు ఇచ్చి అధికారంలోకి వచ్చింది. అధికారం చేపట్టి నెల రోజులు దాటుతున్న ప్రకటించిన విధంగా హామీలు అమలు చేయకపోవడంపై ఆందోళన వ్యక్తమవుతుంది. 2014–19 మధ్య కాలంలో పాలన సాగించిన టీడీపీ ప్రభుత్వం అప్పట్లో అనేక హామీలను గాలికి వదిలేసింది. అందులో నిరుద్యోగులకు ఉద్యోగ కల్పన జరిగే వరకూ రూ.రెండు వేలు చొప్పున నిరుద్యోగ భృతి కల్పిస్తానని ఇచ్చిన హామీని అప్పటి చంద్రబాబు ప్రభుత్వం నిలబెట్టుకోలేదు. 2024 సార్వత్రిక ఎన్నికల్లో మళ్లీ నిరుద్యోగులకు ఉపాధి కల్పించే వరకూ నెలకు రూ.మూడు వేలు చొప్పున అందజేస్తానని, జాబ్ క్యాలెండర్ ప్రకటించారు. అయితే ఇప్పటి వరకూ నిరుద్యోగ భృతి అమలు గురించి ప్రభుత్వం ఎటువంటి ప్రకటన చేయలేదు. అమలు తేదీలను ప్రకటించలేదు. దీంతో నిరుద్యోగులు ప్రభుత్వంపై పెంచుకున్న ఆశలు ఆడియాసలు అవుతాయోమోనని ఆందోళన చెందుతున్నారు. కొత్తపేట నియోజకవర్గంలోని నాలుగు మండలాల్లో 3.08 లక్షల జనాభా ఉండగా 84,496 కుటుంబాలు నివసిస్తున్నాయి, అందులో ప్రతి ఇంటిలో చిన్నా చితకా పనులు చేసుకుంటున్న వారితో కలిపి ఇంటికి ఒక నిరుద్యోగి చొప్పున లెక్కకట్టిన వేలాది మందికి నిరుద్యోగ భృతి ఇవ్వాల్సి ఉంటుంది. 2019–24 మధ్యలోని అప్పటి వైఎస్సార్ సీపీ ప్రభుత్వం ఐదేళ్లలో రాష్ట్ర వ్యాప్తంగా 6.38 లక్షలు ఉద్యోగాల కల్పన జరిగింది. అయితే అంతకు ముందు టీడీపీ ప్రభుత్వం 34 వేల ఉద్యోగాలు మాత్రమే కల్పించారు. దీంతో టీడీపీ గత ట్రాక్ రికార్డును పరిశీలిస్తే ఇంటికో ఉద్యోగం ఇవ్వలేదని, నిరుద్యోగ భృతి ఇవ్వలేదని తెలుస్తోంది. టీడీపీకి ఓటేసి మళ్లీ మోసపోయామా అనే అభిప్రాయం నిరుద్యోగులను వ్యక్తమవుతుంది.

నిరుద్యోగ భృతిపై స్పష్టత ఇవ్వాలి

ఉపాధి ఉద్యోగ అవకాశాలు కల్పిస్తానని హామీ ఇచ్చిన హామీతో అమలులోకి వచ్చిన టీడీపీ ప్రభుత్వం ఆ దిశగా అలోచన చేయడం లేదు. ఇకనైనా ప్రభుత్వం సత్వరమే స్పందించి నిరుద్యోగ భృతి అమలుపై ప్రకటన చేయాలని, వయో పరిమితిని సడలించాలని నిరుద్యోగులు కోరుతున్నారు. నిరుద్యోగ భృతితో పాటు సత్వరమే జాబ్ క్యాలెండర్‌ను ప్రకటించి ఉద్యోగాల కల్పన తేదీలను ప్రకటించి ప్రభుత్వ ఖాళీలను పారదర్శకంగా భర్తీ చేయాలని డిమాండు చేస్తున్నారు. సూపర్ సిక్స్ పథకాలన్నింటినీ కూటమి ప్రభుత్వం సమర్ధవంతంగా అమలు చేయాలని ప్రజలు కోరుతున్నారు.

రాజోలు నియోజకవర్గంలో మలికిపురం, సఖినేటిపల్లి, రాజోలు, మామిడికుదురు మండలాలలో సుమారు 60 వేల 125 కుటుంబాలు ఉన్నాయి. ఇందులో ప్రతి కుటుంబంలోనూ నిరుద్యోగం తోనో, నిరుద్యోగ భృతి కోసమో యువత ఎదురు చూస్తుంది.

నిరుద్యోగ భృతి ఇప్పించండి



నిరుద్యోగ భృతి కోసం ఎంతో మంది నిరుపేదలు ఆశగా ఎదురు చూస్తున్నారు. అధికారం చేపట్టి నెల రోజులు దాటింది. ఇతర పనులపై ఉన్న శ్రద్ధ నిరుద్యోగ భృతిపై లేక పోవడం దారుణం. కూటమి నేతలు కక్ష సాధింపులు మాని ఇచ్చిన హామీల అమలుపై దృష్టి పెట్టాలి. రాష్ట్రంలో ఎన్నో సమస్యలు ఉన్నాయి. వాటిని పరిష్కరిస్తారని ప్రజలు మిమ్మల్ని నమ్మారు. వారి నమ్మకాన్ని వమ్ము చేయకండి.

– యల్లమెల్లి బాబులు, ఎల్.గన్నవరం

హామీలు వెంటనే అమలు చేయాలి



ఎన్డీఏ కూటమి ప్రభుత్వం ఇచ్చిన హామీలు వెంటనే అమలు చేయాలి. ప్రధానంగా నిరుద్యోగులు ఉద్యోగాల కోసం ఎదురు చూస్తున్నారు. ప్రభుత్వం ఏర్పాటై నెల గడుస్తున్నా పట్టించుకోవడం లేదు. నిరుద్యోగ భృతి అయినా వెంటనే ఇవ్వాలి.

– రాపాక వర ప్రసాదరావు, మాజీ ఎమ్మెల్యే, రాజోలు

నిరుద్యోగ భృతి సత్వరమే ఇవ్వాలి



రాష్ట్ర ప్రజలకు అనేక హామీలను ఇచ్చి అధికారంలోకి వచ్చిన కూటమి ప్రభుత్వం సత్వరమే నిరుద్యోగ భృతి ఇవ్వాలని కొత్తపేట మాజీ ఎమ్మెల్యే చిర్ల జగ్గిరెడ్డి డిమాండ్ చేశారు. ఇటీవల జరిగిన సార్వత్రిక ఎన్నికల్లో కూటమి ప్రభుత్వం ఇచ్చిన హామీలను నమ్మి ఓట్లేసిన నిరుద్యోగులను విస్మరించడం సరికాదన్నారు. నిరుద్యోగుల కోరిక మేరకు ప్రభుత్వం సత్వరమే జాబ్ క్యాలెండర్‌ను విడుదల చేసి ఉద్యోగాలకు నోటిఫికేషన్లు విడుదల చేసి తమ చిత్తశుద్ధిని నిరూపించుకోవాలన్నారు. నిరుద్యోగ భృతిపై కనీసం మంత్రివర్గంలో చర్చించి నిర్ణయం తీసుకోకపోవడం దురదృష్టకరమన్నారు.

– చిర్ల జగ్గిరెడ్డి, మాజీ ఎమ్మెల్యే, కొత్తపేట

ప్రతి హామీనీ నెరవేర్చాలి



ప్రజలకు ఇచ్చిన ప్రతి హామీని కూటమి ప్రభుత్వం అమలు చేసి తమ చిత్తశుద్ధిని నిరూపించుకోవాలి. రైతులకు పెట్టుబడి సహాయం అందించలేదు. తల్లికి వందనం అన్నారు. దానిపై కూడా స్పష్టత లేదు. నిరుద్యోగ భృతిపై కూడా ప్రభుత్వం మీనమేషాలు లెక్కిస్తోంది. దీనిపై ప్రభుత్వం వెంటనే స్పందించాలి. ఇచ్చిన ప్రతి ఒక్క హామీని అమలు చేసే దిశగా వెంటనే కార్యాచరణ చేపట్టాలి.

– విప్పర్తి వేణుగోపాలరావు, జెడ్పీ చైర్మన్, కాకినాడ

కొత్తపేట నియోజకవర్గ వివరాలు

మండలం పేరు	జనాభా	కుటుంబాలు	గ్రామాలు	సచివాలయాలు
కొత్తపేట	77859	21732	10	20
ఆత్రేయపురం	65580	19167	17	21
రావులపాలెం	83360	22543	12	23
ఆలమూరు	74023	21054	18	24
	300822	84496	57	84



చాలా ఆశతో ఉన్నాం



చదువు పూర్తి అయినా ఉద్యోగం రాలేదు. కొత్త ప్రభుత్వం వచ్చిందని ఉద్యోగం వస్తుందని చాలా ఆశతో ఉన్నాం. నిరుద్యోగ భృతి అయినా ఎప్పుడు ఇస్తారో తెలియడం లేదు.

– యల్లమిల్లి కిషోర్, సఖినేటిపల్లి లంక

వెంటనే భృతి ఇవ్వాలి



ప్రభుత్వం ఇచ్చిన హామీ మేరకు నిరుద్యోగుల అయిన మేం ఎంతో ఎదురు చూస్తున్నాం, అప్పటి వరకూ నిరుద్యోగ భృతి ఇచ్చినా బాగుంటుంది. ప్రభుత్వం చర్యలు తీసుకోవాలి.

– జిల్లెళ్ళ ఉదయ్ కిరణ్, విశ్వేశ్వరాయపురం, మలికిపురం మండలం

క్లుప్తంగా

డ్రైనేజీ నీరు ఇళ్లలోకి వచ్చేస్తోంది

అంబాజీపేట: స్థానిక మెయిన్ రోడ్డును ఆనుకుని గంగలకుర్రు మలుపు నుంచి కొర్లపాటివారిపాలెం వరకు ఉన్న ప్రధాన డ్రైనేజీలో చెత్తా చెదారం పేరుకుపోయి ఆ నీరంతా ఇళ్లలోకి వచ్చేస్తుందని వాసంశెట్టివారిపాలెం, వెంకటేశ్వర స్వామి వారి వీధి, కొర్లపాటివారిపాలెం గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేశారు. అంబాజీపేట తహసీల్దార్ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన గ్రీవెన్స్‌లో ఆయా గ్రామాల ప్రజలు ఫిర్యాదు చేశారు. డ్రైనేజీల్లో నీరు నిలిచిపోయి దుర్వాసన వెదజల్లడమే కాకుండా, దోమలు విపరీతంగా పెరిగిపోయాయని దాంతో రోగాల బారిన పడుతున్నామని తహసీల్దార్, ఎంపీడీఓలకు వివరించారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి ఈ సమస్యను పరిష్కరించాలని ఆ మూడు కాలనీల వాసులు అధికారులను కోరారు.

రెండు గ్రామాల్లో తాగునీటి పరీక్షలు



తాగునీటి పరీక్షలు చేస్తున్న జల్‌జీవన్ ప్రతినిధి

మామిడికుదురు: డయేరియా, వైరల్ జ్వరాల ప్రభావం తీవ్రంగా ఉన్న నేపథ్యంలో వ్యాధుల వ్యాప్తికి ప్రధాన కారణమైన తాగునీటి నాణ్యతపై అధికారులు ప్రధానంగా దృష్టి సారించారు. దీనిలో భాగంగా సోమవారం లూటుకుర్రు, బి.దొడ్డవరం గ్రామాల్లో జల్‌జీవన్ మిషన్ ప్రతినిధులు తాగునీటి నాణ్యత పరీక్షలు నిర్వహించారు. ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ జయశ్రీ పర్యవేక్షణలో జల్‌జీవన్ మిషన్ ప్రతినిధులు గోవిందు, భరత్ తాగునీటి నాణ్యతా పరీక్షలు చేశారు. దీంతో పాటు రెండు గ్రామాల్లో జరుగుతున్న తాగునీటి సరఫరా, కుళాయిల ఏర్పాటు తదితర అంశాలను కూడా పరిశీలించారు. కార్యక్రమాల్లో సర్పంచ్‌లు అడబాల తాతకాపు, చెల్లుబోయిన రామశివసుబ్రహ్మణ్యం, ఎంపీటీసీ వాసంశెట్టి వెంకటరమణ, పాల్గొన్నారు.

శ్మశానవాటిక శుభ్రం చేయించాలి

కొత్తపేట: స్థానిక బోడిపాలెం శ్మశానవాటికను శుభ్రం చేయించాలని కోరుతూ సోమవారం ప్రజా ఫిర్యాదుల పరిష్కార వ్యవస్థ (పీజీఆర్‌ఎస్)కు పలువురు స్థానికులు వినతిపత్రం సమర్పించారు. కొత్తపేట పంచాయతీ పరిధిలో ప్రధాన గ్రామంతో పాటు అనేక శివారు గ్రామాలకు సంబంధించిన సూర్యగుండాలరేవు శ్మశానవాటిక దహనాలకు, ఖననాలకు అపరిశుభ్రంగా, అసౌకర్యంగా ఉందని, ఆ ప్రాంతాన్ని శుభ్రం చేయించేందుకు చర్యలు తీసుకోవాలని కోరారు. అలాగే ఆ ప్రాంతంలో అక్రమ మట్టి తవ్వకాలు విచ్చలవిడిగా సాగుతున్నాయని పేర్కొన్నారు. మట్టి తవ్వకాలు అరికట్టాలని కోరారు. ఈ వినతిని స్వీకరించిన ఆర్డీవో జీవీవీ సత్యనారాయణ సమస్యల పరిష్కారానికి తగు చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. పీజీఆర్‌ఎస్ కార్యక్రమంలో తహసీల్దార్ ఎలీషా, వివిధ ప్రభుత్వ శాఖల అధికారులు పాల్గొన్నారు.

పాఠశాలల్లో స్టూడెంట్స్ కిట్ల పంపిణీ



రామేశ్వరం జెడ్పీ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు కిట్లు పంపిణీ చేస్తున్న ఎంపీపీ, జెడ్పీటీసీ



బి.సావరంలో స్టూడెంట్స్ కిట్లను పంపిణీ చేస్తున్న సర్పంచ్ రమాదేవి

సఖినేటిపల్లి: స్థానిక గీతామందిరం, రామేశ్వరం జెడ్పీ ఉన్నత పాఠశాలల్లో సోమవారం విద్యార్థులకు స్టూడెంట్స్ కిట్లను ఎంపీపీ వీరా మల్లిబాబు, జెడ్పీటీసీ దొండపాటి అన్నపూర్ణ పంపిణీ చేశారు. ఎంపీటీసీలు రాపాక దీవెన కుమారి, కట్టా వెంకాయమ్మ, సర్పంచ్ కట్టా ఉమామహేశ్వరరావు, ఉపసర్పంచ్ ఇందుకూరి రమేష్‌రాజు, రుద్రరాజు రంగరాజు, ప్రధానోపాధ్యాయులు, బోధనా సిబ్బంది, పలువురు నాయకులు పాల్గొన్నారు. మోరిపోడు మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలో సర్పంచ్ ముప్పర్తి అలివేలు గంగా త్రివేణి స్టూడెంట్స్ కిట్లను పంపిణీ చేశారు. ముప్పర్తి నాని, స్థానికులు, బోధన సిబ్బంది పాల్గొన్నారు.

బి.సావరంలో..

రాజోలు: మండలంలోని బి.సావరం మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలో సోమవారం సర్పంచ్ కడియం రమాదేవి చేతుల మీదుగా ప్రభుత్వం సమకూర్చిన స్టూడెంట్స్ కిట్లను పంపిణీ చేశారు. సర్పంచ్ మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల్లో చదివే విద్యార్థులకు యూనిఫామ్స్, షూస్, బ్యాగ్స్, బెల్ట్స్, పాఠ్యపుస్తకాలతో కూడి ఈ కిట్స్ ఉన్నాయని అన్నారు. ఈ సౌకర్యం ప్రభుత్వ పాఠశాలల్లో చదివే పిల్లలకు మాత్రమే అని ఆమె పేర్కొన్నారు. ఉపసర్పంచ్ రావూరి నాగబాబు, పీఏసీఎస్ అధ్యక్షుడు కంచి వెంకటరమణ, హెచ్‌ఎం కె.శకుంతల, నాయకులు పాల్గొన్నారు.

గ్రామాల్లో మాజీ ఎమ్మెల్యే జగ్గిరెడ్డి పర్యటన

ఆత్రేయపురం: మండలంలోని పేరవరం, ఆత్రేయపురం గ్రామాల్లో మాజీ ఎమ్మెల్యే చిర్ల జగ్గిరెడ్డి పర్యటించారు. ఆత్రేయపురంలో ఇటీవల అనారోగ్యానికి గురై చికిత్స చేయించుకుని విశ్రాంతి తీసుకుంటున్న జిల్లా మత్స్యకార సంఘం సొసైటీ కార్యదర్శి నాటి స్వామిని పరామర్శించి యోగ క్షేమాలు అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో జిల్లా వైఎస్సార్ సీసీ కార్యవర్గ సభ్యుడు రాయి వెంకటేశ్వరరావు, మాజీ డీసీసీబీ డైరెక్టర్ చిలువూరి రామకృష్ణంరాజు, సఖినేటి వాకులరాజు, గొట్టుముక్కల గోపిరాజు, వేగేశ్న గోపాలరాజు, వేగేశ్న గోపి తదితరలు పాల్గొన్నారు.



నాటి స్వామిని పరామర్శిస్తున్న మాజీ ఎమ్మెల్యే జగ్గిరెడ్డి

గ్రామాభివృద్ధికి సహకరించండి



నగరం గ్రామసభలో మాట్లాడుతున్న సర్పంచ్ రమణకుమారి

మామిడికుదురు: నగరం గ్రామాన్ని అభివృద్ధి చేసేందుకు సమష్టిగా ముందుకు వెళదామంటూ సర్పంచ్ జాలెం రమణకుమారి కోరారు. పంచాయతీ కార్యాలయంలో సోమవారం నగరం గ్రామ సర్పంచ్ రమణ కుమారి అధ్యక్షతన జరిగింది. చమురు సంస్థలకు చెందిన సోలార్ ప్లాంట్ నుంచి పన్ను చెల్లించే విధంగా చర్యలు తీసుకోవాలని వార్డు సభ్యులు బత్తుల సురేష్, కోళ్ల సురేష్, కడలి శ్రీనివాసరావు కోరారు. జాతీయ రహదారికి వచ్చే లింకు రోడ్లపై స్పీడ్ బ్రేకర్లు ఏర్పాటు చేయాలని, లేని పక్షంలో ప్రజలు ప్రమాదాల బారిన పడుతున్నారని పలువురు సభ్యులు కోరారు. గ్రామంలో చేపట్టనున్న 18 రహదారుల నిర్మాణంతో పాటు ఇతర అభివృద్ధి పనులపై సమావేశంలో చర్చించారు. ఉప సర్పంచ్ అన్వర్ తాహిర్ హుస్సేన్, కార్యదర్శి పీవీఎస్‌వీ ప్రసాద్, గ్రామ పెద్దలు జాలెం సుబ్బారావు, జాలెం శ్రీనివాసరాజు, తదితరులు పాల్గొన్నారు.

లక్ష్మీనృసింహునికి జన్మ నక్షత్ర పూజలు

సఖినేటిపల్లి: అంతర్వేది ఆలయంలో లక్ష్మీనృసింహుని జన్మనక్షత్రం స్వాతి పురస్కరించుకుని సోమవారం స్వామివారికి అష్టోత్తర కలశాభిషేకం అర్చకులు నిర్వహించారు. ప్రధాన అర్చకుడు పాణింగిపల్లి శ్రీనివాస కిరణ్ ఆధ్వర్యాన స్థానాచార్య వింజమూరి రామరంగాచార్యులు, అర్చకులు ఈ పూజలు నిర్వహించారు. తొలుత వశిష్ట గోదావరి నది నుంచి కలశాలతో తెచ్చిన పవిత్ర జలాలకు వేదమంత్రాలతో పూజలు నిర్వహించారు. కలశాల్లోని జలాల్లోకి శ్రీస్వామివారి మూల మంత్రంతో ఆవాహనం చేసి అర్చన చేశారు. అలాగే సర్వదేవతలను కలశాల్లోకి ఆవాహనం చేసి విశేష పూజలు నిర్వహించారు. వీటితో పాటు పంచామృతాలతో, వేదమంత్రోచ్చారణల మధ్య స్వామికి విశేష అభిషేకం చేశారు. ఆలయ అసిస్టెంట్ కమిషనర్ వి.సత్యనారాయణ, భక్తులు పాల్గొన్నారు.



స్వాతి నక్షత్రం పూజలు చేస్తున్న అర్చకులు

విద్యుత్ సరఫరాకు నేడు అంతరాయం

రావులపాలెం: విద్యుత్ లైన్ల మరమ్మతుల నిమిత్తం రావులపాలెం సబ్‌స్టేషన్ నుంచి సరఫరా అయ్యే అన్ని ఫీడర్ల పరిధిలో మంగళవారం విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్టు ట్రాన్స్‌కో ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ ఎం.రవికుమార్ సోమవారం తెలిపారు. ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు విద్యుత్ సరఫరా ఉండదన్నారు. కొమరాజులంక, రావులపాలెంలోని వెదిరేశ్వరం రోడ్డు, కేఎస్‌ఆర్ కాంప్లెక్స్ ఏరియాలకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నామన్నారు. వినియోగదారులు సహకరించాలని కోరారు.

క్విజ్ పోటీల్లో విజేతలకు బహుమతుల పంపిణీ

ఆలమూరు: మండలంలోని చెముడులంకలోని తిర్నాతి సూర్యనారాయణమూర్తి జిల్లా ప్రజాపరిషత్ పాఠశాలలో సోమవారం నిర్వహించిన క్విజ్ పోటీల విజేతలకు బహుమతుల పంపిణీ జరిగింది. అమెరికాలోని ప్రవాస భారతీయులు, తిర్నాతి వంశీయులకు చెందిన తిర్మాతి శ్రీహిత్ ఎంటర్‌ప్రెన్యూర్ షిప్ ఓరియంటేషన్ ప్రతినిధులు ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ పోటీల్లో ప్రథమ బహుమతిని పవన్‌కుమార్, ద్వితీయ బహుమతిని సూర్యప్రకాష్ సాధించా రు. గెలుపొందిన విజేతలకు నగదుతో పాటు, వెండి పతకాలను అందజేశారు. ఈసందర్భంగా అమెరికా ప్రతినిధులైన శ్రీహిత్, స్విఫ్ గార్డినర్ తదితరులు విద్యార్థులకు చక్కని సందేశాన్ని ఇచ్చారు. అనంతరం ప్రధానోపాధ్యాయుడు బి.శివరామకుమార్‌ను ఉపాధ్యాయులను ఘనంగా సత్కరించారు. తిర్నాతి లవకేశవరావు, వంశీ, వెంకటేశ్వరరావు, కృష్ణమోహన్ పాల్గొన్నారు.

స్వశక్తితో ఉద్యోగ అవకాశాలు దక్కించుకోవాలి



రాజోలు కళాశాలలో నిర్వహించిన ప్రపంచ యువ స్కిల్ డే పాల్గొన్న ప్రముఖులు

రాజోలు: విద్యార్థులు అందరూ స్వశక్తితో ఉద్యోగ అవకాశాలు దక్కించుకోవాలని రాజోలు ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ పి.సాయిబాబు అన్నారు. సోమవారం రాజోలు కళాశాలలో ఆయన అధ్యక్షతన ఏపీఎస్‌ఎస్‌డీసీ ఆధ్వర్యంలో స్కిల్ హబ్ నేతృత్వంలో ప్రపంచ యువ స్కిల్ డే నిర్వహించారు. స్కిల్ హబ్‌లో ఉన్న సదుపాయాలను ఉపయోగించు కుని తర్ఫీదు పొందాలని జిల్లా నైపుణ్యత అధికారి ఈ.లోక్‌మాన్, ఏడీ ఎస్‌డీవో ఓ.నాగబాబు విద్యార్థులకు సూచించారు. వైస్ ప్రిన్సిపల్ టీవీఎస్ పద్మనాభం, స్కిల్ హబ్ డైరెక్టర్ డాక్టర్ పీపీ చంద్రబోస్, నల్లి రాజు, పీఎస్‌ఆర్ ట్రస్ట్ అధినేత నాగరాజు పాల్గొన్నారు.

కాచి చల్లార్చిన నీటినే తాగాలి

అంబాజీపేట: ప్రస్తుత వాతావరణంలో ప్రజలు రోగాల బారిన పడే ప్రమాదం ఉన్నందున ప్రతి ఒక్కరూ ముందస్తుగా కాచి చల్లార్చిన నీటిని తీసుకోవాలని ముక్కామల వైద్యాధికారి ఎ.ఇంద్రావతి అన్నారు. ఇరుసుమండలో ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమాన్ని సోమవారం నిర్వహించారు. వైద్యాధికారిణి మాట్లాడుతూ జలుబు, జ్వరం, దగ్గు, విరేచనాలు ఎక్కువగా ఉంటే వెంటనే స్థానిక వైద్యులను సంప్రదించి మెరుగైన వైద్య సేవలు తీసుకోవాలన్నారు. జ్వరాల బారిన పడకుండా పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలన్నారు.

మృతుడి కుటుంబానికి ఆర్థిక సాయం



మృతుని కుటుంబానికి ఆర్థిక సాయం అందిస్తున్న దాతలు

మలికిపురం: మండలంలోని విశ్వేశ్వరాయపురంలో ఇటీవల మృతి చెందిన దింపు కార్మికుడు పిండ్రాల పోలయ్యకు స్థానిక మానవతా మూర్తులు గ్రూపు ఆధ్వర్యంలో సమకూర్చిన ఆర్థిక సాయం అందించారు. ప్రత్తిపాడు మండలం చింతల్లంక నుంచి వలస వచ్చి విశ్వేశ్వరాయపురంలో అద్దె ఇంట్లో ఉంటూ తాటిముంజెలు, కొబ్బరి బొండాలు తదితరాలు అమ్ముకుని జీవిస్తున్న పిండ్రాల పోశయ్య (39) దురదృష్టవశాత్తూ గత మే నెలాఖరున చెట్టుపై నుంచి పడిపోవడంతో మృతి చెందాడు. అతనికి భార్య, ముగ్గురు పిల్లలు.. ప్రస్తుతం కుటుంబం గడిచే పరిస్థితి లేదు. పిల్లలతో పుట్టింటికి చేరిన పోశయ్య భార్య దుర్గ స్థానిక పెద్దల సహకారంతో మానవతా మూర్తులు గ్రూపును ఆశ్రయించారు. దాంతో గతంలో ఏదైనా మంచి కార్యం జరిగినప్పుడు తమ వంతు సహకారం అందిస్తామని చెప్పిన దాతల సహకారంతో రూ.10 వేల నగదు, నిత్యావసరాలను కాకినాడ నుంచి విచ్చేసిన సేవాభిలాషి సుంకర సుధీర్, తాటిపాక పీహెచ్‌సీ వైద్యాధికారిణి మానస చేతుల మీదుగా సోమవారం అందించారు. అక్కరాజు రాజేశ్వరరావు హైదరాబాద్ రూ.5 వేలు, లక్కవరానికి చెందిన రుద్రరాజు రంగరాజు రూ.2 వేలు సాయం అందించినట్లు గ్రూపు సభ్యులు బోనం రాజు తెలిపారు. ఈ మొత్తాలతో పాటు నల్లి మోహన్ మాస్టారు 26 కేజీల బియ్యం, ఇరుసుమండకు చెందిన కాజా నరసింహారావు నిత్యావసరాలు అందించారు. స్థానిక జెడ్పీ హైస్కూల్ ప్రాంగణంలో హెడ్ మాస్టర్ చింతామణి అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో సర్పంచ్ హెలీనా, రాపాక రత్నరాజు, కాజా నరసింహారావు, పల్లపోతు జైదీప్, ఉపాధ్యాయ బృందం, విద్యార్థులు పాల్గొన్నారు.

విచక్షణ రహితంగా సాగు నీరు వాడొద్దు



పుల్లేటికుర్రులో రైతులకు శిక్షణ ఇస్తున్న జిల్లా అధికారి ఎలియాజర్

అంబాజీపేట: విచక్షణ రహితంగా సాగు నీరు వాడకం వల్ల పంటలపై తీవ్ర ప్రభావం పడి దిగుబడులు తగ్గుతున్నాయని ఉమ్మడి జిల్లాల ప్రకృతి వ్యవసాయ అధికారి జె.ఎలియాజర్ అన్నారు. అంతర్జాతీయ వరి పరిశోధన కేంద్రం, జర్మనీ సంస్థ, వలమ్ అగ్రి ఆధ్వర్యంలో వక్కలంక, కముజువారి లంక, ఇరుసుమండ, కె.పెదపూడి, ముక్కామల, పుల్లేటికుర్రు గ్రామాల్లో కార్బన్ ఉద్గారాల నియంత్రణపై సోమవారం రైతులకు శిక్షణ తరగతులను నిర్వహించారు. ఎలియాజర్ మాట్లాడుతూ అధికంగా సాగు నీరు వినియోగిస్తే భూమి యొక్క భౌతిక, రసాయన, జీవ ధర్మాలు మారిపోయి పంటలు పండించడానికి వీలు కాకుండా తయారవుతున్నాయన్నారు. సాగు ఎంతవరకు ఉపయోగమో అంతవరకు మాత్రమే వినియోగించుకోవాలన్నారు. రసాయన ఎరువులకు బదులుగా ఘన, ద్రవ జీవామృతాలను వినియోగించాలన్నారు. అలాగే పురుగులు, తెగుళ్ల నివారణకు ప్రత్యామ్నాయంగా కషాయాలను వాడాలని రైతులకు వివరించారు. ప్రతి రైతు పెరటి తోటలు పెంచడం వల్ల భూమి సారం పెరగడంతో పాటు అధిక లాభాలు పొందవచ్చన్నారు, వరి గట్లు చుట్టూ పలు పంటలు పెంచుకోవడంపై శిక్షణ ఇచ్చారు. కార్యక్రమంలో సుస్థిర వ్యవసాయ కేంద్ర ప్రతినిధులు ఉదయ్, ప్రసంగి, అంతర్జాతీయ వరి పరిశోధన కేంద్రం ప్రతినిధి అఖిల్‌యాదవ్, అడిషినల్ డీపీఎం సత్యనారాయణ, ఎన్‌ఎఫ్‌ఏ రాధిక, ఎంపీ ఎ.నాగవేణి, ఐసీఆర్పీలు, యూనిట్ ఇన్‌చార్జిలు తదితరులు పాల్గొన్నారు.

నారుమడుల సస్యరక్షణ చర్యలు



ముంపునకు గురైన నారుమడి

మామిడికుదురు: భారీ వర్షాల కారణంగా ముంపు బారిన పడిన నారుమడుల సస్యరక్షణకు తీసుకోవల్సిన చర్యలను మండల వ్యవసాయశాఖాధికారి బి.మృదుల సోమవారం సూచించారు. విత్తనం చల్లిన 2–3 రోజుల వయస్సులో ఉన్నప్పుడు, మూడు కన్నా ఎక్కువ రోజులు ముంపు నీటిలో ఉన్న మొలక శాతం గణనీయంగా తగ్గుతుందన్నారు. నారుమడుల్లోని ముంపు నీటిని త్వరగా బయటకు పంపించాలని సూచించారు. నీరు తీసేకునేందుకు వీలు కాక మొలక దెబ్బతింటే తిరిగి నారుమడులు వేసుకోవాలన్నారు. విత్తిన 7 నుంచి 30 రోజుల మధ్యలో నారుమడి 5 రోజుల కన్నా ఎక్కువ నీట మునిగితే నారు దెబ్బతినే అవకాశం ఉందన్నారు. నష్ట నివారణకు నీటిని బయటకు పంపించిన తరువాత 5 సెంట్ల నారుమడికి ఒక కిలో యూరియా, ఒక కిలో మ్యూరేట్ ఆఫ్ పొటాష్ వేసుకోవడం వల్ల కొత్త ఆకు వచ్చి ఊడ్పులకు త్వరగా అందుతుందన్నారు. తెగుళ్ల నివారణకు లీటరు నీటికి ఒక గ్రాము కార్బండిజం, లేదా రెండు గ్రాముల కార్బండిజం, మాంకోజెబ్ కలిసిన మిశ్రమాన్ని పిచికారీ చేయాలని ఏఓ సూచించారు.